www.kalamjyothi.com

కలం జ్యోతి

తెలుగు దినపత్రిక

ఆదివారం
18.10.2026

నేడు సద్దుల బతుకమ్మ



బతుకమ్మ పండుగలో చివరిరోజు. ఈ రోజున పెద్ద బతుకమ్మ పక్కన.. చిన్న గౌరమ్మను కూడా తయారు చేసి బతుకమ్మను, గౌరమ్మను పూజించి ఆడవారు చెంపలకు రాసుకుంటారు. ఇది ఆశ్వయుజ మాసంలో అష్టమి రోజు అలాగే దుర్గాష్టమి మహా పర్వదినం నాడు వస్తుంది. ఈ రోజున బతుకమ్మకు 5 రకాల నైవేద్యాలు నివేదిస్తారు. వీటిలో పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ పులిహోర, కొబ్బరి అన్నం, నువ్వుల సద్ది వంటివి ఐదు రకాల నైవేద్యాలను బతుకమ్మ అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు



USM SERVICES PRIVATE LIMITED

MD's Foreword

Raghupathi Uppula



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
ఆదివారం 18.10.2026
www.kalamjyothi.com

భారీ వర్ష సూచన

ఉపరితల ఆవర్తనంతో విస్తారంగా వర్షాలు..

- రాష్ట్రంలో మూడు రోజుల పాటు వర్షా లు
- తీవ్రమైన ఈదురుగాలులు వీచే ప్రమాదముంది
- ఉపరితల ఆవర్తనప్రభావంతో వాతావరణంలో మార్పు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- రైతులు పంటల విషయంలో జాగ్రత్తలు పాటించాలి

రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో ఒక్కసారిగా అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఎండల తీవ్రత తగ్గి క్రమంగా వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీస్తుండటంతో ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఇదే సమయంలో రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, ఈదురుగాలుల తీవ్రతపై అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను హెచ్చరిస్తూ అప్రమత్తం చేస్తున్నారు.



కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 18) : తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్నదక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన విస్తారమైన వర్షాలు పడతాయని అధికారులు స్పష్టం చేశారు.

గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు

వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అకాల వర్షాలు, గాలుల కారణంగా సాధారణ జనజీవనానికి ఆటంకం కలగకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించింది. రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులు తీవ్రరూపం దాల్చే సూచనలు కనిపిస్తుండటంతో క్షేత్రస్థాయి యంత్రాంగం అప్రమత్తమైంది.

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు, రైతాంగం అప్రమత్తంగా ఉండి తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు.



గంగనీళ్ల జాతరకు భారీ భద్రత ఏర్పాట్లు

ఎస్పీ జానకి షర్మిల

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 17): నిర్మల్ జిల్లా అడెల్లి గంగనీళ్ల జాతరకు భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఈ మేరకు సిబ్బందికి ఏర్పాటు చేసిన బ్రీఫింగ్ సమావేశంలో ఆమె మాట్లాడారు. దిలావర్‌పూర్ మండలం సాంగ్వి గ్రామ సమీపంలోని గోదావరి సమీపంలో నిర్వహించనున్న అడెల్లి మహాపోచమ్మ గంగనీళ్ల జాతర సందర్భంగా 250 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. భక్తుల రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, గోదావరి నది పరిసరాల్లో భద్రత, అవాంఛనీయ ఘటనల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి అధికారి, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సమస్యయంతో విధులు నిర్వహించాలని, అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు తక్షణమే స్పందించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్‌తో పాటు సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సేవాభావంతో ముందుకు రావాలి

నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్

చిన్నారులకు పిండివంటల పంపిణీ

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 11) : దసరా పండుగను పురస్కరించుకుని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ సంజీవని ఆశ్రమంలోని చిన్నారులకు స్వయంగా తయారు చేసిన పిండివంటలను అందజేశారు. చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడి, వారితో కొంత సమయం గడిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగ ఆనందాన్ని ఆశ్రమ చిన్నారులతో పంచుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. చిన్నారుల పట్ల ప్రతి ఒక్కరూ ఆప్యాయత, సేవాభావంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధర్మశాస్త్ర సేవా కమిటీ శ్రీరాంకిరణ్, కోశాధికారి గండు నవీన్, ప్రధాన కార్యదర్శి మాలె రాజేష్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాదం రంజిత్, అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు సురేష్, కోదండ రామాలయ కమిటీ చైర్మన్ ప్రతాపన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



పంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ

గ్రామాభివృద్ధిలో సిబ్బంది పాత్ర ఎంతో కీలకం

జంగంరెడ్డిపల్లి సర్పంచ్ సునీత

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 17) : బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా జంగంరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ సునీత ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో పారిశుధ్య పనుల నిర్వహణ కోసం శానిటేషన్ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సునీత మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, ప్రజలకు అవసరమైన సేవలు అందించడం, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో పంచాయతీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. పండుగల వేళ సిబ్బంది సేవలను గుర్తించి నూతన వస్త్రాలు అందించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. నూతన వస్త్రాలు, పారిశుధ్య సామగ్రి అందజేయడంపై పంచాయతీ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, మాలమరి శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సోఫీ నగర్‌లో ఘనంగా కుంకుమార్చన



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 17) : నిర్మల్ పట్టణంలోని సోఫీ నగర్‌లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి దాదాపు 200 మంది మహిళలు పెద్ద ఎత్తున కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తితో కుంకుమార్చన చేశారు. భక్తి పారవశ్యంతో సాగిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని భక్తులు ప్రార్థించారు.

చెరువులో గుర్తుతెలియని మృతదేహం

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 17) : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని సమాజ్ చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. చెరువులో తేలియాడుతున్న శవాన్ని గుర్తించిన స్థానికులు సమాచారం అందించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. మృతదేహం ఎవరిది, చెరువులోకి ఎలా వచ్చింది అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉండగా, మృతుడి గుర్తింపుతో పాటు మరణానికి గల కారణాలపై స్పష్టత రావాల్సి ఉంది.



కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

ఆదివారం 18.10.2026

www.kalamjyothi.com



రూ.లక్షతో మహాలక్ష్మి అలంకరణ

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 17) : మండలంలోని కందికట్కూర్ బస్టాండ్‌లో శ్రీ మహాలక్ష్మి అమ్మవారు లక్షా ఒక రూపాయి ధనరాశి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సిరిసంపదలు, సౌభాగ్యానికి ప్రతీకగా నిలిచే అమ్మవారి దివ్యరూపం విశేషంగా ఆకట్టుకుంది. కరెన్సీ నోట్ల అలంకరణ, బంగారు వర్ణపు సూర్యప్రభ, పూలమాలలు, ఇరువైపులా సింహాల ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ధనరాశిలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకున్న భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. జగన్మాత కృపతో అందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు.



సమైక్యతను చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ

కలెక్టర్ గరిమ అగ్రవాల్

- ఉద్యోగులు సంబురాల్లో పాల్గొనడం సంతోషకరం
- పోటీల్లో ప్రతిభ చూపినవారికి బహుమతులు





కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 17) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ పండుగ అని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం బతుకమ్మ సంబురాలు వైభవంగా జరిగాయి. వివిధ శాఖల మహిళా అధికారులు, సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను తీర్చిదిద్దారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ వేడుకలను ప్రారంభించి, మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు.

ప్రజలందరికీ సుఖసంతోషాలు చేకూరాలి..

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ, ముందస్తు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా బతుకమ్మలను పేర్చి ఆడిపాడటం అభినందనీయమన్నారు. వేములవాడలో శుక్రవారం సద్దుల బతుకమ్మ ఘనంగా జరిగిందని, ఆదివారం సిరిసిల్లలో నిర్వహించనున్నామని తెలిపారు.

విజేతలుగా నిలిచిన శాఖలకు అభినందనలు..

వివిధ శాఖల ఆధ్వర్యంలో తీర్చిదిద్దిన బతుకమ్మల పోటీల్లో వ్యవసాయ శాఖ మొదటి బహుమతి సాధించగా, రెవెన్యూ శాఖ ద్వితీయ, ఎంపీపీఎస్ తంగళ్లపల్లి తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి. విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్వో జయశ్రీ, వేములవాడ ఆర్డీవో కేవీఎస్‌బీ కుమారి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, అధికారులు అఫ్జల్ బేగం, సౌజన్య, ఏంజెలా ఆల్ఫ్రెడ్, స్వప్న పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి

అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

- రైతులు మద్దతు ధర పొందేలా చూడాలి

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 17) : పత్తి సాగు చేసిన రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే తమ ఉత్పత్తులను విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు. పత్తి కొనుగోళ్లు, ఏర్పాట్లపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సీసీఐ, మార్కెటింగ్, ఇతర శాఖల అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 50,300 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, 45,270 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారని తెలిపారు. పత్తి నాణ్యత ఆధారంగా గరిష్ట మద్దతు ధర రూ.8,667 లభిస్తుందని వెల్లడించారు. జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో ఐదు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, వేములవాడ పరిధిలో రెండు, కోనరావుపేట మండలంలో ఒకటి, ఇల్లంతకుంట మండలంలో రెండు కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా సమీపంలోని సీసీఐ కేంద్రాల్లో విక్రయించి లబ్ధి పొందాలని పిలుపునిచ్చారు.

నిబంధనల ప్రకారం పక్కాగా కొనుగోళ్లు జరపాలి..

సీసీఐ, మార్కెటింగ్, ఇతర సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పత్తి కొనుగోళ్లను పక్కాగా, పారదర్శకంగా చేపట్టాలని స్పష్టం చేశారు. తేమ శాతం పరిశీలన, తూకాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీసీఐ, రవాణా శాఖ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు, జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు పాల్గొన్నారు.





దుర్గాదేవి ఉత్సవాలకు విరాళం

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 17) : మండల పరిధిలోని పెద్దలింగాపూర్ గ్రామ బస్టాండ్ వద్ద కొలువుదీరిన శ్రీ దుర్గాదేవి అమ్మవారి శరన్నవరాత్రోత్సవాల నిర్వహణకు గ్రామ సర్పంచ్ గన్నేరం వసంత-నర్సయ్య దంపతులు రూ.10,016 విరాళంగా అందజేశారు. అమ్మవారి ఉత్సవాల నిర్వహణకు తమ వంతు సహకారంగా ఆర్థిక సాయం అందించడం పట్ల శ్రీ దేవి శరన్నవరాత్రోత్సవ కమిటీ సభ్యులు సర్పంచ్ దంపతులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ దుర్గా భవానీ అమ్మవారి కృపాకటాక్షాలు వసంత-నర్సయ్య దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని నిర్వాహకులు అమ్మవారిని వేడుకున్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 18.10.2026
4
www.kalamjyothi.com

పూలను పూజించే
గొప్పసంస్కృతి మనది

బీజేఎల్పీ నేత
ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 17) : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ వేడుకలు నిలుస్తాయని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శనివారం రాత్రి బతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని, పూలను పూజించే విశిష్టమైన సంస్కృతి మనదని, సంప్రదాయాలను కాపాడుకుంటూ బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రజలందరికీ ఆయన దసరా, బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య మాట్లాడుతూ మన సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. తొలుత బతుకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. అదనపు కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ వేడుకల్లో జిల్లా అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, డీఆర్‌డీవో విజయలక్ష్మి, డీడబ్ల్యూవో వినూత్న, డీపీఆర్వో విష్ణువర్ధన్, డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆడపడుచుల ఆత్మగౌరవానికి
బతుకమ్మ పండుగ ప్రతీక

మున్సిపల్ చైర్‌పర్సన్
పెండెం శ్రీలక్ష్మిరామానంద్

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 17) : నర్సంపేట పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో ముందస్తు బతుకమ్మ వేడుకలను శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మిరామానంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల్లో ఆమె మహిళా కౌన్సిలర్లతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్ది, సంప్రదాయ పాటలు పాడుతూ మహిళలు ఆటపాటలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి నిదర్శనమైన బతుకమ్మ పండుగను అందరూ కలిసికట్టుగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందిస్తూ మహిళల్లో ఐక్యతను పెంపొందించేందుకు ఇటువంటి వేడుకలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మహిళలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ స్థానిక సంస్కృతిని ప్రోత్సహించడంలో పురపాలక సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్లు, మున్సిపల్ మహిళా సిబ్బంది, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, పట్టణ మహిళలు పాల్గొన్నారు.



లక్ష పుష్పార్చన..

నిర్వహించిన ఎమ్మెల్యే దంపతులు
సమృద్ధిగా పంటలు పండించాలి :
బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 17) : ప్రజల సుఖసంతోషాలు, సుభిక్షం కోసం, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలు చేతికి రావాలని ఆకాంక్షిస్తూ బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, సతీమణి ఏలేటి కవితారెడ్డి దంపతులు లక్ష పుష్పార్చన, శ్రీ లలితా సహస్రనామ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రార్థిస్తూ నిర్మల్ జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు సాగు చేసిన పంటలు సమృద్ధిగా పండి మంచి దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, నిర్మల్ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారి ఆశీస్సులు ఉండాలని వేడుకున్నారు.



మహాలక్ష్మి రూపంలో
దుర్గామాత దర్శనం

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 17) : మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి పురాతన ఆలయం ఎదుట శ్రీ దుర్గాభవాని యూత్ అసోసియేషన్ ఆరో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మండపంలో శ్రీ దుర్గామాత శనివారం మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ అసోసియేషన్ ప్రతినిధులు కేకే మహేందర్ రెడ్డితో పాటు ఆయన వెంట వచ్చిన ఏఎంసీ చైర్మన్ మేడిపల్లి దేవానందం, వైస్ చైర్మన్ నంది కిష్టన్నను శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామాల్లో యువత భక్తిశ్రద్ధలతో ఇలాంటి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని, జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య, మాజీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, సర్పంచ్‌లు బాపురెడ్డి, సిర్రం నాగరాజు యాదవ్, ఉప సర్పంచ్‌లు రవీందర్ గుప్తా, జజ్జరి దేవేందర్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి బాల్‌రెడ్డి, మేండే శ్రీనివాస్ యాదవ్, గుర్రాల రాజిరెడ్డి, వంగ శ్రీకాంత్ రెడ్డి, కస్తూరి ప్రవీణ్ రెడ్డి, రాములు, ఏఎంసీ డైరెక్టర్ మిట్టపల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

హైమావతి మృతికి నాయకుల నివాళి

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 17) : మండల కేంద్రం పరిధిలోని పాత మద్దంపురం గ్రామానికి చెందిన జంపాల హైమావతి మృతి చెందిన విషయం తెలుసుకున్న టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి పార్టీ తరపున ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకుడు బండారి సత్యం, గ్రామ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ బసీర్, ఉపాధ్యక్షుడు పోలేపల్లి రమేష్, మాజీ అధ్యక్షుడు నాంపెల్లి మల్లయ్య, నాయకులు నాంపెల్లి రాములు, ధోనికెలా చంద్రమౌళి, గవస్కర్, మామిడి మొగిలి పాల్గొన్నారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
ఆదివారం 18.10.2026
www.kalamjyothi.com



రైతాంగానికి నాణ్యమైన కరెంట్ అందిస్తాం

- విద్యుత్ ఉపకేంద్రానికి ఎమ్మెల్యే శంకుస్థాపన
- మెరుగైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యం
- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



కలంజ్యోతి, నెక్కొండ (అక్టోబర్ 17) : మండల పరిధిలోని దీక్షకుంట్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే పరిసర గ్రామాల ప్రజలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని తెలిపారు. స్థానికంగా ఎదురవుతున్న లోఓల్టేజీ, విద్యుత్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులకు సాగు అవసరాల నిమిత్తం ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్‌ను అందించేందుకు ఈ ఉపకేంద్రం ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతుల సంక్షేమానికి కట్టుబడి విద్యుత్ నెట్‌వర్క్‌ను పటిష్టం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఘనంగా బతుకమ్మ వేడుకలు

తెలంగాణ సంప్రదాయాలను కాపాడుకోవాలి

కలంజ్యోతి, హన్మకొండ (అక్టోబర్ 17) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను మండల పరిధిలోని సాదులనగర్ గ్రామంలో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తెలంగాణ సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు మన బతుకమ్మ పాటలను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఆట పాటలతో సందడి చేశారు. గ్రామస్తులంతా కలిసికట్టుగా పండుగ వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.





పీఆర్టీయూ కార్యవర్గంలో ఎల్లారెడ్డిపేట ఉపాధ్యాయులు

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 17) : నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పీఆర్టీయూ టీఎస్ ఆరో రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఎన్నుకున్న నూతన రాష్ట్ర కార్యవర్గంలో ఎల్లారెడ్డిపేట మండల శాఖకు చెందిన పలువురు ఉపాధ్యాయులకు కీలక పదవులు దక్కాయి. రాష్ట్ర అధ్యక్షుడిగా భిక్షంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్ రెడ్డి ఎన్నిక కాగా, ఎల్లారెడ్డిపేటకు చెందిన గర్గుల కృష్ణహరి, గోసిక మధు రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్లుగా, చేరాల ప్రభాకర్, ఎండీ షఫీ ఉపాధ్యక్షులుగా, గోలి ఆనంద్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా టీచర్ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ 72,457 మంది సభ్యత్వంతో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్రంలోనే అతిపెద్ద ఉపాధ్యాయ సంఘంగా నిలిచిందని పేర్కొంటూ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. మండల శాఖ నుంచి రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం



దక్కించుకున్న వారిని జిల్లా అధ్యక్షుడు జి. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఈ. కిషన్, మండల అధ్యక్షుడు తెల్ల పూర్ణచందర్, ప్రధాన కార్యదర్శి బొల్లి భగవాన్ అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

రెడ్డివాడలో హైమాస్ట్ లైట్ ఏర్పాటు

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 17) : మండల పరిధిలోని రేపాక గ్రామాభివృద్ధిలో భాగంగా గ్రామ పంచాయతీ నిధులతో రెడ్డివాడలో రూ.లక్ష విలువైన హైమాస్ట్ లైట్‌ను సర్పంచ్ కాత మల్లేశం ఏర్పాటు చేయించారు. ఎవర్‌గ్రీన్ యూత్ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ లైట్‌ను గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. రెడ్డివాడలో రాత్రి వేళల్లో వెలుతురు సదుపాయం కల్పించడంతో స్థానికులు, యువకులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొదని మహేష్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, వార్డు సభ్యులు కొంకటి మమత, యాదగిరి, రొండ్ల శ్రీనివాస్ రెడ్డి, ఎండీ పాషా, రాజారత్నం, ఎట్ల రాజు, కూన తిరుపతి, బైక పోచయ్య, రాచకొండ సతీష్, పంచాయతీ కారోబార్ బాబు, హెల్పర్ శ్రీను, గ్రామ ప్రముఖులు, యువకులు పాల్గొన్నారు.



ఏఐ మార్ఫింగ్‌పై నేహాశర్మ ఆగ్రహం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను ఉపయోగించి తన అనుమతి లేకుండా ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేస్తూ సర్క్యులేట్ చేస్తున్న వారిపై సినీ నటి నేహా శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అనుమతి లేకుండా సృష్టిస్తున్న ఏఐ కంటెంట్ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందని, ఇలాంటి అనధికారిక చిత్రాలు, వీడియోలను వెంటనే తొలగించకపోతే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటానని తన ఎక్స్ ఖాతా వేదికగా గట్టి హెచ్చరికలు జారీ చేశారు. తన ముఖాన్ని, పోలికలను వాడి తప్పుగా చిత్రీకరించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేస్తూ, ఫేక్ అకౌంట్లు లేదా ఏఐ టెక్నాలజీ వెనుక దాక్కున్నా చట్టపరమైన శిక్ష నుంచి ఎవరూ తప్పించుకోలేరని తేల్చిచెప్పారు. సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకుని డీప్‌ఫేక్ కంటెంట్ పెరుగుతున్న వేళ ఆమె వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.